జన జాతర సభకు.. సర్వం సిద్ధం

- నేడు నారాయణపేటకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక
- భారీగా ఏర్పాట్లు చేసిన కాంగ్రెస్
- సభ విజయవంతం కోసం జిల్లా వ్యాప్తంగా జన సమీకరణ
- ఎంపీ ఎన్నికల్లో విజయమే లక్ష్యం
- సీఎం అయిన తర్వాత సొంత జిల్లాలో మూడో సభ



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, సీనియర్ నాయకుడు శివకుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించ తలపెట్టిన జనజాతర సభకు సర్వం సిద్ధమైంది. సభను విజయవంతం చేయడం కోసం పార్టీ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేశాయి. మహబూబ్‌నగర్ పార్లమెంట్ వ్యాప్తంగా జనసమీకరణ చేసి, సత్తా చాటాలని పార్టీ ఉవ్విళ్లూరుతోంది. పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. అన్ని నియోజకవర్గాల్లో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపించడం ద్వారా సత్తా చాటాలని అధిష్ఠానం భావిస్తోంది. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత సొంత జిల్లా పరిధిలో నిర్వహించనున్న ఈ సభ మూడోది. గతంలో కోస్గిలో, మహబూబ్‌నగర్‌లో సభలు నిర్వహించారు. వాటితో పాటు రెండు సార్లు సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో సభలు ఏర్పాటు చేశారు. సీఎం ఇన్‌చార్జిగా ఉండటంతోపాటు ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఉంటుందని భావిస్తుండటంతో కాంగ్రెస్ ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిష్మాను సాధ్యమైనంత ఎక్కువగా వినియోగించుకునేందుకు పార్టీ శ్రేణులు ప్రణాళికలు చేస్తున్నాయి. సోమవారం నిర్వహించనున్న సభతో పాటు.. మరో సభ కూడా పోలింగ్ లోపు నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. వంశీచంద్ నామినేషన్ కార్యక్రమంలో కూడా రేవంత్‌రెడ్డి పాల్గొనే అవకాశం ఉంది. జన జాతర సభకు సీఎం హెలికాప్టర్ ద్వారా సాయంత్రం 4.30 గంటలకు నారాయణపేటకు చేరుకోనుండగా.. తిరుగు ప్రయాణంలో రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్ వెళ్లనున్నారు.

గెలుపు కోసం వ్యూహాలు..

గత పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ నియోజకవర్గంలో అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందారు. అప్పుడు కూడా ప్రధాన పార్టీల నుంచి ప్రస్తుతం ఖరారైన అభ్యర్థులే బరిలో నిలిచారు. రెండో స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ నిలువగా.. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మూడో స్థానంలో నిలిచారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయ్యింది. అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలిచారు. ఆ కదనోత్సాహంలో ఉన్న కాంగ్రెస్ శ్రేణులు ప్రస్తుతం ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోవడం కోసం వ్యూహాలు రచిస్తున్నాయి. ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించుకుంటూ, బలహీనంగా ఉన్న చోట బలం పెంచుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అదే సమయంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కొడంగల్ నియోజకవర్గంపై దృష్టి సారించగా.. బీజేపీకి కొంత పట్టు ఉంటుందని భావిస్తున్న నారాయణపేట జిల్లాపై కాంగ్రెస్ ఫోకస్ పెంచింది. అందులో భాగంగానే ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా మక్తల్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున పోటీచేసి ఓటమి చెందిన కీలక నాయకుడు మదిరెడ్డి జలంధర్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. అంతకుముందే ఈ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ తరఫున టికెట్ ఆశించిన మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డికి అవకాశం దక్కక పోవడంతో.. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి మరీ పార్టీలో చేర్చుకున్నారు. ఈ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ఎస్‌కు చెక్ పెట్టి.. అసెంబ్లీ ఎన్నికల్లో వరించిన విజయ ప్రస్థానాన్ని కొనసాగించాలని భావిస్తున్నారు. కొడంగల్, మక్తల్, నారాయణపేట నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించే పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం ఫిబ్రవరిలోనే శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సర్వే పనులు సాగుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలను ఆకర్షించేందుకు అదే ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోంది.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట: నారాయణపేట జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో సోమవారం జరిగే కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి ఆదివారం సాయంత్రం సభ ఏర్పాట్లను పరిశీలించారు. స్థలం చదును చేయడం,తో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలని చెప్పారు. ఈ సందర్భంగా పర్ణికారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన సీఎంకు జిల్లా ప్రజలు కృతజ్ఞతలు చెప్పాలన్నారు. అందుకు ప్రజలు స్వచ్ఛందగా తరలిరావాలని కోరారు. సింగారం క్రాసింగ్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, బహిరంగ సభ స్థలాలను ఎస్పీ యోగేష్‌గౌతమ్‌తో కలిసి పరిశీలించారు.

670 మంది పోలీసులతో బందోబస్తు

సభ కోసం వేసిన కుర్చీలు



నారాయణపేట: సీఎం సభ సందర్భంగా ఎస్పీ యోగేష్‌గౌతమ్ బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపుపై ఎస్పీ ఆరా తీశారు. డీఎస్పీ లింగయ్యకు పలు సూచనలు చేశారు. ఇద్దరు అదనపు ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 65 మంది ఎస్ఐలు, 75 మంది ఏఎస్ఐ, హెచ్ఎస్‌లు, పీఎస్, 415 మంది హెచ్‌జీలు, 50 మంది మహిళా పోలీసులు, రెండు రోప్ పార్టీలు, టీఎస్ఎస్‌పీ ప్లాటున్స్, స్పెషల్ పార్టీ పోలీస్‌లు, రెండు ఐటీబీపీ ప్లాటూన్స్‌లతో కలిపి మొత్తం 670 మంది పోలీసులతో బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేశామని చెప్పారు. ఉమ్మడి జిల్లా నుంచి బందోబస్తు కోసం వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా కేంద్రంలోని శెట్టి ఫంక్షన్ హాల్‌లో పోలీస్ ఎస్పీ సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేంద్రుడు, రియాజ్ హుల్‌హక్, డీఎస్పీలు లింగయ్య, మహేష్, శ్రీనివాస్‌లు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

దేశానికే మార్గదర్శి

- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు



కొల్లాపూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, ఏప్రిల్ 14 : భారత దేశానికే దిక్సూచి, మార్గదర్శిగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ నిలిచారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలను కొల్లాపూర్ పట్టణంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జగదీష్, దళిత బహుజన ఉపాధ్యాయ సంఘాల నాయకుడు చెన్నయ్య, తెలంగాణ మాలల చైతన్య సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాందాస్‌ల అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం విరాజిల్లడానికి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే ప్రధాన కారణమని అన్నారు. మానవ హక్కులను రాజ్యాంగంలో పొందుపర్చి అందరికీ స్వేచ్ఛా సమానత్వాన్ని కల్పించిన భారత రాజ్యాంగం ద్వారా దేశప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారని తెలిపారు. అనంతరం దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి జూపల్లి పేర్కొన్నారు. అదేవిధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. అంతకు ముందు అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో యువకులు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా మునిసిపల్ కౌన్సిలర్లు, దళిత యువజన, దళిత బహుజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ ఉపాధ్యాయులు, కార్మికులు, బహుజనవాదులు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నేటి నుంచి వార్షిక పరీక్షలు

- ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు..
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,81,834 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ



నంచర్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రవీందర్ (ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 14: విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం వార్షిక పరీక్షలు సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందుకు గాను విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే పదో తరగతి పరీక్షలు ముగిశాయి. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఎస్ఏ2(సమ్మెటివ్ అసెస్‌మెంట్) పరీక్షలు 15వ తేదీ నుంచి 22 వరకు జరుగనున్నాయి. 23న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, ప్రోగ్రెస్ కార్డులు ఇవ్వనున్నారు. ప్రైవేట్ పాఠశాలలు కూడా జిల్లా ఉమ్మడి పరీక్ష విభాగం రూపొందించిన ప్రశ్న పత్రాల ద్వారానే పరీక్షలు నిర్వహించాలని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు సూచించారు. మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు ఆయా జిల్లాల్లోని అన్ని పాఠశాలలకు ఉమ్మడి పరీక్ష బోర్డు ద్వారా ప్రశ్నపత్రాలు అందజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 4,119 ప్రభుత్వ, లోకల్‌బాడీ, ప్రైవేట్, గురుకుల, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని 4,81,834 మంది విద్యార్థులు ఎస్ఏ-2 పరీక్ష రాయనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

ఎస్ఏ-2 పరీక్షలు జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. ఉమ్మడి పరీక్షల విభాగం నుంచి అన్ని పాఠశాలకు ఇప్పటికే ప్రశ్నపత్రాలు పంపించాం. ఆ ప్రశ్నపత్రాల ద్వారానే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించాలి. విద్యాశాఖ ఇచ్చిన టైంటేబుల్‌ను అందరూ విధిగా పాటించాలి.

- ఎ.రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
మహబూబ్‌నగర్	679	195	287	1,17,354
నారాయణపేట	339	152	139	83,847
జోగులాంబ గద్వాల	294	144	154	90,952
నాగర్‌కర్నూల్	633	218	236	1,08,478
వనపర్తి	370	130	192	81,563

బ్రహ్మోత్సవం

- నేటి నుంచి కోదండరామస్వామి ఉత్సవాలు
- గిరిపుత్రుల పూజలు అందుకోనున్న స్వామి



ఉత్సవాలకు సిద్ధమైన కోదండరామస్వామి ఆలయం

ఆలయ గోపురం



లింగాల, ఏప్రిల్ 14: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలోని పురాతనమైన కోదండరామస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజనులు జరుపుకునే ఈ ఉత్సవాలను ఏటా 11 రోజులు నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని క్రీస్తు శకం 11వ శతాబ్దంలో నిర్మించారని చరిత్రకారుల అభిప్రాయం. ఇక్కడ నిజాం ప్రభుత్వ కాలం నుంచి ఉత్సవాలు జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా.. బహ్మోత్సవాల సందర్భంగా టెంకాయలు అమ్ముకునేందుకు, లైబజార్ వసూలు చేసేందుకు వేలం వేసి, వచ్చిన ఆదాయంతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పూజారి ధరూరు రామాచారి తెలిపారు.

ఉత్సవాల వివరాలు

ఈ నెల 15న సాయంత్రం పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, రక్షాబంధనం, రాత్రికి అంకురార్పణ నిర్వహిస్తారు. 16న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, బేరీపూజ, బలిహరణం, ఎదురుకోళ్ల సేవ, 17న బలిహరణం, సీతారాముల కల్యాణం, వేదపారాయణం, 18న హోమం, బలిహరణం, హనుమంత వాహనసేవ ఉంటుంది. 19, 20 తేదీల్లో హోమం, బలిహరణం, 21న హోమం, బలిహరణం, రాత్రికి చిన్న తేరు (పుష్పరథం), 22న హోమం, బలిహరణం, రాత్రికి పెద్ద రథోత్సవం, 23న రాత్రి భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, సలేశ్వర క్షేత్రంలో పుణ్య స్నానాలు, 24న పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం పుష్పయాగం, సప్తవర్ణాలు, ఏకాంతసేవ, మే ఐదున రాత్రికి పొన్నసేవ నిర్వహించనున్నట్లు పూజారి భాస్కర్, ఆలయ అధ్యక్షుడు చెప్పారు.



ఉత్సవ మూర్తులు

రైల్లో నుంచి జారి పడి యువతి మృతి

- గుంటూరు నుంచి జడ్చర్లకు వస్తుండగా గద్వాల పట్టణంలో ఘటన

గద్వాల క్రైం, ఏప్రిల్ 14: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఓ యువతి మృతి చెందింది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు సమీపంలో జరిగింది. సంఘటనకు సంబంధించి రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన వెంకటశశి ప్రియాంక (30), ఆమె భర్త జితేంద్ర జడ్చర్లలో నివాసం ఉంటున్నారు. జితేంద్ర జడ్చర్లలోని ఓ ప్రవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. భార్యభర్తలు రెండు రోజుల క్రితం తిరుపతికి వెళ్లి వచ్చారు. అనంతరం ప్రియాంక తన తండ్రి, తమ్ముడికి తిరుపతి ప్రసాదం ఇచ్చి వచ్చేందుకు శనివారం గుంటూరుకు వెళ్లింది. తిరిగి సాయంత్రం అక్కడి నుంచి జడ్చర్లకు వచ్చేందుకు రైలు ఎక్కింది. అర్ధరాత్రి సమయంలో గద్వాల హౌసింగ్ బోర్డు సమీపంలో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి పడి మృతి చెందింది. అయితే గుంటూరు నుంచి బయలుదేరిన తన భార్య జడ్చర్లకు రాక పోవడంతో, అలాగే నిద్రపోయి అలాగే కాచిగూడకు వెళ్లి ఉంటుందని జితేంద్ర భావించాడు. హైదరాబాద్‌లోని రైల్వే స్టేషన్‌కు వెళ్లి విచారించగా, ఆమె కాచిగూడకు చేరుకోలేదని రైల్వే అధికారులు తెలిపారు. అదే సమయంలో గద్వాల సమీపంలోని రైలు పట్టాల మధ్య మృతి చెందిన ప్రియాంక ఫొటోలను రైల్వే హెడ్‌కానిస్టేబుల్ విచారణ నిమిత్తం అన్ని రైల్వేస్టేషన్లకు పంపించారు. అప్పుడు హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లోనే ఉన్న జితేంద్ర ఆమె ఫొటో చూసి గుర్తించడంతో వివరాలు తెలిశాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు.

మహిళల మెడలోంచి పుస్తెలు చోరీ

- ఆరు బయట నిద్రిస్తుండగా ఘటన
- ఒక ద్విచక్ర వాహనం కూడా..
- చిట్టెబోయిన్‌పల్లిలో ఘటన

మిడ్జిల్, ఏప్రిల్ 14: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టెబోయిన్‌పల్లి గ్రామంలో శనివారం ఇంటిముందు నిద్రిస్తున్న మహిళల మెడలోంచి నగలు చోరీ అయ్యాయి. ఎస్ఐ చంద్రమోహన్‌రావు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టిబోయిన్‌పల్లి గ్రామంలో తిరుపతమ్మ శనివారం ఇంటిముందు నిద్రిస్తున్నది. అర్ధరాత్రి 12 గంటల తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని పుస్తెల తాడును కట్ చేసి రెండు పుస్తెలు, 15 బంగారు గుండ్లను చోరీ చేశారు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో నిద్రలేచిన తిరుపతమ్మ చోరీ జరిగినట్లు గుర్తించింది. అదే గ్రామానికి చెందిన చంద్రమ్మ మెడలో ఉన్న పుస్తెతో పాటు ఎనిమిది బంగారు గుండ్లు, అదే గ్రామానికి చెందిన పాల వ్యాపారి అనుప కృష్ణయ్య బైక్ చోరీ అయ్యాయి. తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భయాందోళనల్లో ప్రజలు

గ్రామంలో శనివారం రాత్రి మూడు చోరీలు జరుగడంతో చిట్టె బోయిన్‌పల్లి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో పోలీసులు గస్తీని పెంచి, చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవాలని కోరుతున్నారు.

కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటాం

- మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



భూత్పూర్‌లో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

భూత్పూర్, ఏప్రిల్ 14: ప్రతీ కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ గౌడ్, ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు అధైర్య పడకుండా, ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. గతంలో జరిగిన చిన్నపాటి పొరపాట్లు ఈ ఎన్నికల్లో పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, గారడీలతో కాలం గడుపుతోందన్నారు. ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి, అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ పాలనపై ప్రజలు మూడు నెలలకే విసుగు చెందారన్నారు. ఎంపీ స్థానాలను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాధ్యం కాని హామీలతో అధికారంలోకి..

నవాబ్‌పేట: కాంగ్రెస్ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి రాగా.. జిల్లా ఎమ్మెల్యేలు ప్రజల్లోకి రావడం లేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ప్రజల్లో ఉంటూ వారి సాదకబాధలు తెలుసుకుంటున్నారని చెప్పారు. నవాబ్‌పేటలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ హామీలను ఎందుకు అమలు చేయడం లేదో ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసి, విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య ఎంపీపీ అనంతయ్య, జడ్పీటీసీ సభ్యుడు రవీందర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సింహులు, వైస్ ఎంపీపీ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటక కళాకారులకు ఉగాది జాతీయ పురస్కారాలు

మహమ్మదాబాద్, ఏప్రిల్ 14 : తెలుగు నాటక రంగంలో విశిష్ట సేవలు అం దిస్తున్న మండల పరిధిలోని వెంకట్‌రెడ్డి పల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుల కే.జనార్ధన్‌రెడ్డి, దేశాయి పల్లికి చెందిన ఉపాధ్యాయులు బురగంజి రాములుకు తెలుగు వెలుగుసాహితీ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో జరిగిన ఉగాది జాతీయపురస్కారాల మహోత్సవంలో వేదిక నిర్వాహకులు, సరస్వతీ ఉపన్యాసకులు వంగాల శాంతికృష్ణ ఆచార్య, రిటైర్డ్ హైకోర్టు జడ్జి బెజ్జారం చంద్రకుమార్ పురస్కారాలను అందజేశారు. వీరిరువురు ఉపాధ్యాయవృత్తిలో కొనసాగుతూ 1000నాటకాలకు పైగా వివిధ పాత్రలు ధరించి పలువురి మన్నలు పొందారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దండ, ఏప్రిల్ 14 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని ఓ చికెన్ దుకాణంలో పనిచేసే ఎస్‌కే ఖాజా (35) అనే వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

మాగనూరు, ఏప్రిల్ 14 : ఇరు వర్గాల ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అంబేడ్కర్ యువజన సంఘం యువకులకు, ఛత్రపతి యువజన సంఘం యువకులకు మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ యుజవన సంఘం సభ్యులు బ్యానర్లను, జెండాలను మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న కరెంటు స్తంభాలకు కట్టారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఛత్రపతి యువజన సంఘం సభ్యులు కాషాయం ఉండాలని బ్యానర్లను కట్టారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా కట్టిన బ్యానర్లపై అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు బ్యానర్లు కట్టడంపై ఇరు వర్గాల మధ్య మాట పెరిగి తోపులాడుకుంటూ ఒకరినొకరు కర్రలతో కొట్టుకున్నారు. ఇరు వర్గాల వారు రోడ్డుపై రాస్తారోకో చేయగా వాహనాలు ఇరువైపులా బారులు తీరాయి. పోలీసులకు సమాచారం ఇవ్వగా వచ్చి అదుపు చేసే సమయంలో పోలీసులపై కూడా దాడి చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వగా ఒక మార్గంలో ఉన్న కొందరికి తలకు కంటిపై ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. పోలీస్ స్టేషన్‌లో ఉన్న పోలీసులు నారాయణపేటలో జరిగే సీఎం బందోబస్తుకు వెళ్లారని తెలిపారు. విషయం తెలుసుకున్న మక్తల్ సీఐ చంద్రశేఖర్, మాగనూరు ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్, కృష్ణ ఎస్ఐ నవీద్ పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణను తెలుసుకుని ఇరు వర్గాలపై కేసు నమోదు చేస్తామని వారు తెలిపారు.

వంద పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తెస్తాం



పనులను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, ఏప్రిల్ 14 : కొల్లాపూర్ పట్టణంలోని రామపురం రహదారిలో కొనసాగుతున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తేస్తామని ఆయన పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు వంద పడకల ఆసుపత్రిలో అన్ని రకాల రోగాలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అదేవిధంగా మాతా శిశు సంరక్షక ఆసుపత్రిని అయన పరిశీలించారు. ఆసుపత్రిలో గర్భిణులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవికాలంలో ఆసుపత్రికొచ్చే గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రిలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని జూపల్లి వైద్యులకు సూచించారు. ఆయన వెంట మునిసిపల్ కౌన్సిలర్లు, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతన్న ఆశలు ఆవిరి

- పంట చేతికొచ్చే సమయంలో నేలపాలు
- ఎండిన పంట పశువుల పాలు
- భూర్భజలాలు తగ్గిపోవడమే కారణం
- పంటలను పరిశీలించని ప్రజాప్రతినిధులు, అధికారులు

గండీడ్, ఏప్రిల్ 14 కష్టాన్ని నమ్ముకున్న రైతన్న ఆశలు ఆవిరవుతున్నాయి. నాట్లు వేసే సమయంలో చెరువులు, కుంటల్లో కొద్దిపాటి నీరు ఉండగా, అడపాదడపా బోర్లలోనూ నీరు ఉన్నాయనే ఆశతో రైతులు వరిసాగు చేశారు. చివరి దశలోఉన్న వరికి రెండు మూడు తడుల మేర కూడా నీరు అందితే పంట పండినట్లే. వేసవి ఆరంభం నుంచే ఎండలు మండిపోవడం, ఒక్కసారిగా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లలో నీరు పూర్తిగా రావడం లేదు. కొందరు రైతులు అప్పులు చేసి బోర్లు వేసినా లాభం లేకపోయింది. పంటకు రైతన్నలు లక్షలు వెచ్చింది వరి పంటకు పెట్టుబడి పెట్టి ఎంతో ఆశతో ఉన్న సమయంలోనే చేతికి వచ్చిన పంట చూస్తుండగానే నీళ్లు లేక ఎండిపోయింది. మండలంలో మొత్తం 7008 ఎకరాలలో వరి పంట సాగు చేయగా సుమారు 500 ఎకరాలు ఎండిపోయినట్లు రైతులు తెలిపారు. అధికారుల సూచన మేరకు గత ఏడాది కంటే ఈ సారి వరి తక్కుగానే సాగు చేశారని, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

ఆదుకోండి సారూ..



రెండు ఎకరాల్లో వరి సాగు వేశాను. సుమారు రూ.35 వేల పెట్టుబడి పెట్టిన. ఎకర పూర్తి గా ఎండిపో వడంతో చేసిన కష్టం వృ థా అయ్యింది. పెట్టుబడి కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో తోచని స్థితిలో ఉన్నాము. ఎం డిన వరి పంటలో పశువులను మేతకు వదిలాము.

- చెన్నయ్య, రైతు, గోవిందుపల్లి

ఎండిన పంటకు పరిహారం అందించాలి



ఎంతో కష్టపడి ఆరు ఎకరాలలో వరి సాగు చేశాను. మూడు బోర్లలో నీరు ఆగి పోయింది. రెండు మూడు తడులు పారితే కోతకు వచ్చేది. లక్షా పది వేల పెట్టుబడి నే లపాలైంది. ఎండిన పంటను గొర్రెలను, ఎద్దులను మేపుతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

- గున్న నారాయణ, రైతు, పగిడ్యాల్



చేతికి వచ్చిన వరి పంట ఎండిపోవడంతో గొర్రెలను మేపుతున్న దృశ్యం

పంటలను పరిశీలిస్తాం

ఎండిన పంటలను తప్పకుండా పర్యవేక్షించి పై అధికారులకు నివేదిక పంపుతాము. రైతులు అధైర్యపడొద్దు. భూర్భజలాలు తగ్గడంతోనే బోర్లలో నీరు తగ్గిపో యింది. మండలంలో 7008 ఎకరాలలో వరి వేశారు. సగం వరకు ఎండిపోయిఉండవచ్చని అంచనా ఉంది. పై అధికారుల దృష్టికి తీసుకవెళ్తాం.

- వనీషా, వ్యవసాయాధికారి

వెన్నాచేడ్ చెరువు కింద కూడా 15 రోజుల్లో వరి పంటలు కోతకు వచ్చే అవకాశం ఉంది. 15 రోజుల వరకు చెరువులో ఉన్నా ఆయకట్టు చివరి పొలాలకు నీరు అందుతుందో లేదో అనే ఆవేదనలో రైతులు ఉన్నారు. మండల పరిధిలోని పగిడ్యాల్, బల్సుర్‌గొండ, రంగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో కూడా రైతులు బోర్ల కింద వేసిన వరి పంట ఎండిపోవడంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. కొందరి పంట పాలుపోసుకొనే సమయంలో ఎండిపోయింది అని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. ఎండిన వరి పంటను చూడడానికి ఏ అధికారీ ఇంతవరకు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టం పరిహారం చెల్లించి రైతుల ను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



మృతి చెందిన అంజలి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 14: వివాహిత అనుమాస్పదంగా మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా.. ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని హరిజనవాడలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి బుడ్డెంకానీ అంజలి(25) వివాహిత ఇంటి వెనకవైపు బహిర్భూమికి వెళ్లింది. ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో అంజలి భర్త అంజలి ఇంటి పక్కనే ఉన్న రాజుతో చెప్పాడు. రాజు చుట్టు పక్కల చూస్తుంటే సెల్‌ఫోన్ వెలుతురులో చెట్టుకు చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనబడిందని అంజలి భర్తకు సమాచారం ఇచ్చారు. వెం టనే అక్కడికి వెళ్లి కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తే వైద్యులు పరి శీలించి మృతి చెందినట్లు తెలిపారని అన్నారు. గతంలో ఇంటి పక్కనే ఉండే తమ కులానికి చెందిన కురుమయ్య దేవమ్మ, నవీన్‌లు బంగారం దొంగిలించామంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు ఇంటి వద్ద పలుమార్లు గొడవపడి కొడుతూ చంపుతామని బెదిరించారని అన్నారు. తమపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కుర్మయ్య, దేవమ్మ, నవీన్, వెంకటయ్య, చెన్నమ్మ అనే వారు కొట్టి చంపి ఉరి వేసుకున్నట్లుగా చిత్రీకరించారనే అనుమానం వ్యక్తం చేశారు. నిందితులుగా అనుమానం వ్యక్తం చేసిన వారి ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి ఇరుగుపొరుగు వారు కలిసి అనుమానితులను చితకబాదారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి గాయపడిన అనుమానితులను రాత్రికిరాత్రి ఆసుపత్రికి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం భర్త ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. వనపర్తి సీఐ మృతురాలు బంధువులను సముదాయించి గొడవ సద్దుమనగడానికి ప్రయత్నించారు. భర్త ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన అనంతరం విచారణ చేసి సంఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.



ఖిల్లాఘణపురంలో మృతురాలి ఇంటి ముందు పోలీసుల పహారా

యువకుడికి రిమాండ్

పాన్‌గల్, ఏప్రిల్ 14: బాలికలను ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి తీసుకెళ్తున్న యువకుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసిన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికను వనపర్తి మండలం వశ్యనాయక్ తండాకు చెందిన శివ ప్రేమిస్తున్నానని చెప్పి పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యారు. సమాచారం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన ఎస్ఐ సిబ్బంది వారి ఆచూకి తెలుసుకొని రెండు గంటల్లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం యువకుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

మిడ్జిల్, ఏప్రిల్ 14 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు అంగన్‌వాడీ టీచర్ నిర్మల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్‌రావు తెలిపారు. అంగన్‌వాడీకేంద్రంలో బియ్యం, పప్పు, వంటగ్యాస్ సిలిండర్లు, గుడ్లతో పాటు వంటసామాగ్రి, గిన్నెలు, గ్లాసులను తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మిడ్జిల్, ఏప్రిల్ 14 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్‌రావు తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని కల్వకుర్తి, జడ్చర్ల ప్రధాన రహదారిపై గంగాపూర్ స్నేహహేచరీస్ కంపెనీ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు గోపాల్, మన్సూర్‌లు ఆపారు. టిప్పర్ డ్రైవర్ సరైన పత్రాలు చూపించకపోవడంతో టిప్పర్‌ను స్టేషన్‌కు తీసుకవచ్చి టిప్పర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రాజాపూర్ వాసి మృతి

కోడేరు, ఏప్రిల్ 14 : రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన మహేష్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... రాజాపూర్ గ్రామానికి చెందిన తెలుగు బక్కయ్య, చిట్టెమ్మలకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు గోపాల్ పది సంవత్సరాల క్రితం బావిలో పడి మృతి చెందాడు. చిన్న కుమారుడైన మహేష్(20) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని పటాన్‌చెరువులో తన అక్క అంజనమ్మతో కలిసి ఉంటున్నాడు. శనివారం రాత్రి ఏడు గంటల సమ యంలో రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరువు నుంచి సంగా రెడ్డి వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి కారు, ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి డివైడర్‌ను ఎక్కింది. అదే సమయంలో రోడ్డు దాటుతున్న మహేష్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉన్న ఇద్దరు కుమారులు మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి.. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు.

చిరుతలతో ఎలాంటి అపాయం లేదు

- అటవీశాఖ అధికారి నరేందర్

కోయిలకొండ, ఏప్రిల్ 14 : కొన్ని రోజుల నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో చిరుత పులుల సంచరిస్తున్నట్లు తమకుతెలిసిందని, వాటి వల్ల గ్రామస్థులకు ఎలాంటి అపాయం ఉండని అటవీ అధికారి నరేందర్ అన్నారు. కోయిలకొండలో చిరుతల సంచారంపై ఆదివారం సూరారం, బూర్గుపల్లి, అంకిళ్ల తదితర గ్రామాలలో పర్యటించిన ప్రజలకు అవగాహన కల్పించారు. తీవ్ర ఎండలతో నీరు ఉన్న చోటుకు చిరుతలు వలసలు వచ్చాయని, వాటిపై గ్రామస్థులు దాడులకు పాల్పడరాదని, అపాయం తలపెట్టవద్దని సూచించారు. చిరుతలు పశువులు, మేకలు, గొర్రెలపై దాడులు చేస్తే అటవీ శాఖ నుంచి తగిన నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా చిరుతలు సంచరించిన ప్రదేశాలను అటవీ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో తాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హైనాల దాడిలో రెండు లేగా దూడలు మృతి

ఊర్కొండ, ఏప్రిల్ 14: హైనాల దాడిలో రెండు లేగా దూడలు మృతి చెందడంతో పాటు మరో దానికి తీవ్ర గా యాలు అయినటువంటి సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊ ర్కొండ మండలంలోని ఇప్పపహాడ గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతులు లక్ష్మయ్య గౌడ్, రమేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగా గ్రామ శివారులోని తమ వ్యవసాయ భూమిలో ఆవులతో పా టు లేగ దూడలను దొడ్డిలో ఉంచి గ్రామానికి రావడం జరి గిందన్నారు. ఆదివారం తెల్లవారుజామున పాలు తీసుకురావ డానికి వెళ్లగా అప్పటికే రెండు లేగ దూడలు మృతి చెందడంతో పాటు మరొకటి తీవ్ర గాయాలతో ఉందని అన్నారు. దాంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా బీట్ అధికారి రమణమ్మ, వాచర్ చంద్రుడు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి హైనాల దాడిలో లేగ దూడలు మృతి చెందాయని వారు పేర్కొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వంగూరు, ఏప్రిల్ 14: ఒకసారి అవకాశం ఇస్తే ఎంపీగా గెలిచి ప్రజలకు అందుబాటులో ఉండి ఈప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వృత్తిలో నిబద్ధతతో పనిచేసి సకల సౌకర్యాలను వదులుకొని ప్రజాసేవకోసం రాజకీయాల్లోకి వచ్చినట్లు ఈసందర్భంగా ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా కొనసాగిన వారు ఈప్రాంత సమస్యల గురించి ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఎంపీ రాములు 5ఏళ్ల పదవీ కాలంలో చేసిన అబివృద్ధి శూన్యమని అన్నారు. ఆయన కుమారుడు భరత్‌ప్రసాద్‌కు జడ్పీ ఛైర్మన్ పదవి ఇవ్వలేదనే సాకుతో బీజేపీలో చేరి నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు ఎంపీ రాములుకు లేదని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి గతంలో ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా ఉండి ఇక్కడినుంచి డబ్బులు మూటగట్టుకొని అక్కడి నేతలకు అందజేశాడని ఆరోపించారు. ప్రధాని మోదీ కొత్త రాజ్యాంగాన్ని సృష్టించేందుకు కుట్ర జరుగుతుందని అందుకు కాంగ్రెస్ వత్తాసు పలుకుతుందని విమర్శించారు. దీంతో పేద ప్రజలు ఓటు హక్కును వినియోగించే అవకాశం లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం పదవి ఎక్కి ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. నవీన్‌కుమార్‌రెడ్డి, అఖిలేష్‌రావు, గణేష్‌రావు, లాలుయాదవ్, అంకు సురేందర్, ఆంజనేయులు, ఎల్లగౌడ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఐదుగురికి తీవ్ర గాయాలు

దామరగిద్ద, ఏప్రిల్ 14 : ఆగి ఉన్న ఆటోని బస్సు ఢీ కొన్న ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం దేశాయిపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వసంత కథనం ప్రకారం మద్దూర్ మండలం మోమినాపూర్ గ్రామానికి చెందిన ఆటో నారాయణపేట నుంచి మద్దూర్‌కు ప్రయాణికులను ఎక్కించుకొని వస్తుంది. ఈ క్రమంలో దేశాయిపల్లి వద్ద వేచి ఉన్న మరో ఇద్దరు ప్యాసింజర్‌లను ఎక్కించుకుంటున్న క్రమంలో వెనకాల నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఆగి ఉన్న ఆటోను ఢీ కొట్టడంతో ఆటో సమీప పొలంలో పల్టీలు కొట్టి కిందపడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆశమ్మ, మొగులమ్మ, పద్మతోపాటు ఓ పాప, బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నారాయణపేటకు తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు మహబూబ్‌నగర్‌కు తరలించారు. బాధితులను స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పరామర్శించారు.

కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి

మక్తల్, ఏప్రిల్ 14 : వీధి కుక్కల దాడిలో 60 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ముష్టిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ముష్టిపల్లి గ్రామానికి చెందిన కురువ యాంకి రాజు తన గొర్రె పిల్లలను రైతు పొలంలో ఉన్న కొట్టంలో ఉంచాడు. శనివారం అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో దాదాపు 60 గొర్రె పిల్లలు మృతి చెందాయని బాధితుడు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన రమేష్

గోపాల్‌పేట, ఏప్రిల్ 14: వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బుద్దారం గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం బుద్దారం గ్రామానికి చెందిన మునగాల రమేష్ (41) శనివారం రాత్రి తాగిన మైకంలో భార్య, తల్లిదండ్రులతో గొడవపడి తన ఇంట్లో ఓ గదిలోకి వెళ్లి గడియ వేసుకున్నాడు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో చప్పుడు రావడంతో భార్య తన మరిది మధును పిలిచి తలుపులు బద్దలు కొట్టించింది. అప్పటికే రమేష్ చీరతో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఓదార్చారు. వనపర్తి ఏరియా ఆసుపత్రిలో రమేష్ మృతదేహానికి నివాళులర్పించారు. ప్రభుత్వపరంగా రమేష్ కుటుంబాన్ని ఆదుకుంటామని వారికి భరోసా కల్పించారు.

అనారోగ్యంతో ఒకరు మృతి

మండలంలో బుద్దారం గ్రామంలో అనారోగ్యంతో ఒకరు మృతి చెందారు. కుటుంబ సభ్యులు గ్రామస్థులు తెలిపిన వివరాలిలా..దొడగుంటపల్లి వెంకటయ్య (55) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో..

కొత్తకోట : పట్టణంలో విద్యుత్ షాక్‌తో ఓ మహిళ ఆ దివారం మృతి చెందింది. గోపాల్‌పేట మండల బుద్దారం గ్రామానికి చెందిన మెహ్రాన్ (45) పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో నివాసం ఉంటున్నారు. మెహ్రాన్ బట్టలు ఉతుకు నీళ్ల కోసం తడి చేతులతో మోటారు పెట్టడానికి వెళ్లి కరెంట్ ప్లగ్ పెడుతుండగా షాక్ తగిలింది. స్పృహ కోల్పోయి కింద పడిన ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో అంత్యక్రియల కోసం బుద్దారం తీసుకె ళ్లారు. ఈ విషయంపై ఎస్సై మంజునాథ్‌రెడ్డిని వివ రణ కోరగా తమకు ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేని తెలిపారు.

ఉమ్మడి పాలమూరులో

పగలు సెగలు - రాత్రి చల్ల గాలులు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 14 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పగటి వేళ ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు అటు ఇటుగా ఉంటోంది. సాయంత్రం ఐదు గంటల తర్వాత వాతావరణం చల్లబడుతోంది. రాత్రి వేళల్లో చల్లగాలులు వీస్తుండటంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఆదివారం కూడా ఇదే విధమైన వాతావరణం కొనసాగింది.

మహబూబ్‌నగర్ జిల్లాలో గత నాలుగు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలు మాత్రమే నమోదు కాగా, ఆదివారం జిల్లాలోని గండీడ్ మండలంలో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఒక్కరోజులోనే 1.4 డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడంతో ఎండప్రభావం ఎక్కువగా కనిపించింది. సీసీకుంటలో 40.3 డిగ్రీలు, మహ్మదాబాద్‌లో 40.1 డిగ్రీలు నమోదు కాగా మిగతా అన్ని మండలాలలో40 డిగ్రీల లోపే నమోదైంది. జడ్చర్లలో 39.9, మహబూబ్‌నగర్‌లో 39.5, భూత్పూర్‌లో 39.6 డిగ్రీలు నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డి మండలంలో అత్యధికంగా 40 డిగ్రీలు పగటి ఉష్ణోగ్రత నమోదయ్యింది. ధరూర్, ఇటిక్యాలల్లో 39.8, గద్వాలలో 39.7, అలంపూర్, అయిజ, వడ్డేపల్లిలలో 39.6, ఉండవెల్లిలో 39.8, మల్దకల్‌లో 39.1, రాజోలిలో 38.9, మానవపాడులో 38.2, గట్టులో 37.8 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. రేపు, ఎల్లుండి ఎండలు దంచికొట్టే అవకాశం ఉంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24 నుంచి 27 డిగ్రీలుగా నమోదు అవుతున్నాయి. వనపర్తి జిల్లాలో ఎండ తీవ్రత తగ్గింది. ఐదు రోజులుగా రాత్రి వేళలో చల్లటి గాలులు వీస్తున్నాయి. ఆదివారం జిల్లాలో అత్యధికంగా పాన్‌గల్‌లో 40.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదయింది. కొత్తకోట, పెబ్బేరులో 40.1, ఆత్మకూరులో 40 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్దమందడి, చిన్నంబావిలలో 39.6, శ్రీరంగాపూర్, మదనాపూర్ 39.1, గోపాల్‌పేట 39.0, వనపర్తి 38.9, అమరచింత 38.8, వీపనగండ్ల 38.2, ఘణపూర్ , రేవల్లి, 37.6, కొత్తకోటలో 36.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో సగటున గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీలు నమోదు కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా నమోదైంది. అదే విధంగా జిల్లాలో అత్యధికంగా అచ్చంపేట మండలంలో గరిష్ఠంగా 40.0 డిగ్రీల ఉష్ణోగత నమోదయ్యింది. కల్వకుర్తిలో 39.9, బిజినేపల్లిలో 39.7, పెద్దకొత్తపల్లిలో 39.2, నాగర్‌కర్నూల్‌లో 38.9, అచ్చంపేటలో 38.8, చారకొండలో 38.7, పెంట్లవెల్లిలో 38.6, పదరలో 39.9, ఉప్పునుంతలలో 37.8, తెల్కపల్లిలో 37.7, బిజినేపల్లిలో 36.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లాలో సగటున గరిష్ఠ ఉష్ణోగ్రత 37 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠం 22 డిగ్రీలుగా ఉంది. కోస్గీ మండలంలో 33, మక్తల్‌లో 37, నర్వలో 29, కృష్ణలో 39 డిగ్రీలుగా గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది.

ఎంపీ ఎన్నికల్లో గెలుపు ఏకపక్షం

- ఎంపీ అభ్యర్థి మల్లురవి



తెలకపల్లిలో కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

తెలకపల్లి, ఏప్రిల్ 14 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ది ఏకపక్ష గెలుపు అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. మిగతా బీఆర్ఎస్, బీజేపీలు రెండవ స్థానం, మూడవ స్థానం కోసం పడాల్సిందేనని వారన్నారు. అంతకుముందు తెలకపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని వారన్నారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రోడ్‌షో నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే సంపూర్ణ అభివృద్ధి

తాడూరు: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లయితేనే బడుగు బలహీన వర్గాలతోపాటు పేద, మధ్య తరగతివర్గాలకు చెందిన వారందరికీ సంపూర్ణ న్యాయం జరుగుతుందని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ప్రచారాన్ని కొనసాగించారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డితోపాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రోడ్‌షోలో వారు మాట్లాడారు. తాడూరు జడ్పీటీసీ సభ్యురాలు మందడి రోహిణి, తెలకపల్లి జడ్పీటీసీ సభ్యురాలు సుమిత్రతోపాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేఆర్ ఫంక్షన్ హాల్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఆదివారం రోడ్డు షో నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డితో కలిసి పూలమాల వేసి నివాళ్ళు అర్పించి మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి, మండల అధ్యక్షుడు మిద్దె రాములు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమృత్ రెడ్డి, గంగనమోని తిరుపతయ్య, మాన్యనాయక్, భగవంత్ గౌడ్, బాల్‌రాజు, మిద్దె మల్లేష్, మస్కూరి బంగారయ్య, కర్నాటి తిరుపతయ్య, మోహన్ రెడ్డి, నజీర్, మహేందర్, కత్తె ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట : కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆదివారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి మల్లురవి మాట్లాడారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లయ్యగౌడ్, శ్రీనివాస్ బహదూర్, దానం బాలరాజు, వెంకట్రామిరెడ్డి, మాధవులు, ఉస్మాన్‌రవూఫ్, నాయసాయిలు, వరుణ్‌కుమార్, సహదేవ్ పాల్గొన్నారు.

సమానత్వం కోసమే జైభీమ్ దీక్షలు



అంబేడ్కర్‌కు నివాళులర్పించి ప్రసంగిస్తున్న వంకేశ్వరం నిరంజన్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : కులాలు వర్గాల ప్రమేయం లేకుండా అందరికీ సమన్యాయం జరగాలనే సంకల్పంతోనే జైభీమ్ దీక్షలు నిర్వహించినట్లు దళిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ పేర్కొన్నారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 14వరకు జిల్లా అంతటా నిర్వహించిన జైభీమ్ దీక్షలను ఆదివారం ముగించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల, మత, ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడమే దీక్షల ప్రధానోద్దేశమని చెప్పారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చడానికి మనువాదులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన సామాజిక బాధ్యత అట్టడుగు వర్గాలపై ఉందన్నారు. జైభీమ్ దీక్ష అధ్యక్షుడు దేవరపాగ బంగారయ్య, ప్రధాన కార్యదర్శి కొత్త పరుశరామ్, దళిత నాయకులు విష్ణుమూర్తి, డి.రాంచందర్, కొత్త గంగాధర్, వంకేశ్వరం వెంకటస్వామి, మిద్దె భాస్కర్, శ్రీనివాసులు, వెంకటస్వామి, పల్లె బంగారయ్యలు పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మతల్లి బోనాలు

ఉప్పునుంతల, ఏప్రిల్ 14 : మండల పరిధిలోని తాడూరు గ్రామంలో ఆదివారం ఈదమ్మతల్లి బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈదమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర నాయకుడు మోపతయ్య, నాయకులు తిరుపతయ్య, ఎంపీటీసీ తదితరులు ఉన్నారు.

అంబలి కేంద్రం ప్రారంభం

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 14 : రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో పట్టణ మునిసిపల్ కౌన్సిలర్లు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ నేతృత్వంలో ఆదివారం అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. బీఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం ద్వారా వేసవిలో పేద ప్రజల దాహార్తితోపాటు ఆకలి తీర్చేందుకు అంబలి కేంద్రం దోహదపడుతుందని మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహెముదాబేగం, మునిసిపల్ కౌన్సిలర్లు పేర్కొన్నారు. మునిసిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది నరసింహారావు, బాలస్వామి, షేక్.రహీంపాష, శ్రీదేవి, మేకల రమ్యా, నయీమ్, మేకల శిరీష, బరిగెల శ్రీలక్ష్మీ, బరిగెల రాముడు, కర్ని అలివేలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి.ఎక్బాల్, వేణుగోపాల్ యాదవ్, ఖాదర్‌పాష, రమేష్ ముదిరాజ్, బొర్రెల్లి మహేష్, మధు, కర్ని వాసు, వెంకటేష్, ఖాద్రి, బాబా తదితరులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి : కొల్లాపూర్ మండలం రామపురం గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉచిత అంబలి కేంద్రాన్ని బ్లాక్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఆకునమోని రాముయాదవ్ ప్రజా సేవా సంస్థ నిర్వాహకులు ఆకునమోని చంద్రయ్యయాదవ్‌లు ప్రారంభించారు. గ్రామ నాయకులు గడ్డం శ్రీరామ్‌యాదవ్, ఉడత రామస్వామి, కలమూరి నిరంజన్, దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి పండగ

ఉప్పునుంతల, ఏప్రిల్ 14: వండల పరిధిలోని కొరటికల్ గ్రామంలో యాదవుల ఆరాధ్యదైవమైన ఎల్లమ్మతల్లి పండగ ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీమణి సీబీఎం ట్రస్ట్ చైర్ పర్సన్, జడ్పీటీసీ సభ్యురాలు అనురాధ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఆమెను శాలువా కప్పి సన్మానం చేశారు. నాయకులు వెంకటరెడ్డి, అనంతరెడ్డి, రఘుపతిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిద్దాం'

ఉప్పునుంతల, ఏప్రిల్ 14 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చూపిద్దామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ మండల ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎన్నికలలో ఆశీర్వదించాలని కోరారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్, నాయకులు రవీంద్‌రావు, భూపాల్‌రావు, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

కొల్లాపూర్, ఏప్రిల్ 14 : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన 20మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ నాయకుడు బొర్రెల్లి మహేష్ ఆధ్వర్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



జూపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

ఘనంగా అంబేడ్కర్ జయంతి

- పార్టీలు, ప్రజా సంఘాల నాయకుల ఘన నివాళి



అంబేడ్కర్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు, యువకులు అంబేడ్కర్ విగ్రహానికి, చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.హబీబ్, కౌన్సిలర్లు తీగల సునేంద్ర, కొత్త శ్రీనివాసులు, నాయకులు కొండ నాగేష్, సలీం, జెట్టి చిన్న వెంకటేష్, బాదం నరేందర్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఇంచార్జీ దిలీప్‌చారి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలు మాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, యాదగిరిరావు పాల్గొన్నారు. బీఎస్పీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృధ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి బోనాసి రాంచందర్, నాయకులు మోహన్‌రెడ్డి, కల్యాణ్, రాముడు, వెంకటేష్, బాలనాగులు, భాస్కర్, మొగులాల్, అంజి, మధు, రమేష్, సురేష్ పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు పూలు మాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం నాయకులు ఆర్.శ్రీ



వంగూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నివాస్, అశోక్, కాశన్న, మధు, సత్యనారాయణ పాల్గొన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కేవీపీఎస్ నాయకులు సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పర్వతాలు, అశోక్, రామయ్య, రామస్వామి, క్రాంతి, మధు పాల్గొన్నారు. దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్ము భరత్, బండి లక్ష్మీపతి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్.ఆనంద్ జీ, డీహెచ్‌పీఎస్ నాయకులు శ్రీనివాస్, సురేష్, బండి శ్రీను, బాలకృష్ణ, శివశంకర్, గోపిచారి, శేఖర్, బాబా పాల్గొన్నారు. అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మిషన్ అధ్యక్షుడు మద్దిలేటి, మిషన్ సభ్యులు చంద్రయ్య, శోభన్‌బాబు, వెంకటస్వామి, రాము, చెన్నయ్య, వినోద్, కృష్ణ, బాలరాజు, చిన్నమద్దిలేటి, వెంకటదాసు, రవి పాల్గొన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, నాయకులు నిరంజన్‌యాదవ్, శ్రీనివాసులు, రవీందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్ర పటానికి జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీధర్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు యుగంధర్‌రెడ్డి, వేణుగోపాల్, కృష్ణయ్య, బాలస్వామిరావు, సాయిరెడ్డి, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. తపస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తపస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, వెంకటేష్, యాదగిరిరావు, ప్రసాద్, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, నిరంజన్, లక్ష్మారెడ్డి, బాలుసాగర్, రామారావు, భాస్కర్‌గౌడ్, మల్లయ్య, తిరుపతిరెడ్డి, శ్రావణ్, శ్రీనివాసచారి, మల్లేష్, విజయ్‌భాస్కర్, మోహన్, గోవింద్ రెడ్డి, సురేష్, సుజీవన్, విష్ణు, జగదీష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్ర పటానికి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్‌రెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి, నాయకులు ఎస్.ఈశ్వర్, రమేష్, మురళీధర్‌రావు, నరసింహ, వెంకటస్వామి, బాలస్వామి, శేఖర్, మద్దిలేటి పాల్గొన్నారు. సెక్యులర్ రైటర్స్ ఫోరం ఉమ్మడి జిల్లా సభ్యుడు గుడిపల్లి నిరంజన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించడంతో పాటు ఈ నెల 21న హైదరాబాదులో జరుగనున్న సామూహిక కవి సమ్మేళనం కరపత్రం విడుదల చేశారు. కవులు మద్దిలేటి, గస్‌పాష, తిరుపతయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీధర్‌శర్మ, గోవర్ధన్, జానయ్య లక్ష్మణ్‌నాయక్, ఆంజనేయులు, అర్జున్, సుబ్బయ్య, సైదులు, విష్ణు, జయశంకర్ పాల్గొన్నారు.

● తెలకపల్లి: అంబేడ్కర్ జయంతి వేడుకలను అంబేడ్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళురల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిలు మాట్లాడారు.

● దోమలపెంట: అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం దోమలపెంట, వటవర్లపల్లి, ఈగలపెంట గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ప్రధాన కూడల్లో ఆయన విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్, నాయకులు కిషన్, ప్రసాద్, శారద, కోటయ్య, వటవర్లపల్లిలో అనిల్, బాలకృష్ణ, కుమార్, బాబురావు, భరత్, సర్యనాయక్, రాములు, శ్రీనువాస్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు నివాళులర్పించారు. ఉప్పునుంతలలో అంబేడ్కర్ విగ్రహం వద్ద విగ్రహానికి నివాళుల్పంచారు. ఎంపీపీ తిప్పర్తి అరుణ, ఎస్సై లెనిన్, నాయకులు అనంతరెడ్డి, ఎంపీవో నారాయణ, మల్లయ్య, బాబు ఉన్నారు.

● వెల్దండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు భూపతిరెడ్డి, వెంకటయ్యగౌడ్, కేశమల్ల కృష్ణ, శేఖర్, లింగం, మోతీలాల్, సంజీవ్, నిరంజన్ తదితరులు ఉన్నారు.



తిమ్మాజిపేటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

జూపల్లిలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

చారకొండ: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని జూపల్లిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు రామస్వామితో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, పలువురు నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాలస్వామి, కలమందల జగపతి, నిరంజన్, సంజీవ్, రాములు యాదవ్, నూరుపాల్‌నాయక్, పరుశరాములు, ప్రశాంత్, మహిపతి, మల్లేష్, మధు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

● చారకొండ మండలంలోని చారకొండ, సిర్సనగండ్ల, జూపల్లి, చంద్రాయన్‌పల్లిలో తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. వివిధ సంఘాల నాయకులు, అంబేడ్కరిస్టులు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆదేవిధంగా మండల కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకొన్నారు. ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, మండల నాయకులు చంద్రశేఖర్, విజయ్, మల్లేష్, అయోధ్య మొగులయ్య, మురళి, జగదీష్, మహేష్, సంతోష్, మున్న, ప్రశాంత్, సురేష్, శంకర్, రాజు, కొండల్, లక్ష్మణ్, విఘ్నేష్, పీఎల్ వెంకటయ్య, శ్రీను, వెంకటయ్య, సురేష్, పోచయ్య, సంజీవ్, మల్లికార్జున్, ప్రశాంత్, పరశురాములు, బాలస్వామి, అశోక్, మహిళలు, వివిధ సంఘాల నాయకులు, అంబేడ్కరిస్టులు తదితరులు పాల్గొన్నారు.

కుడికిళ్లల్లో రక్తదాన శిబిరం

● కొల్లాపూర్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా కొల్లాపూర్ మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామంలో ఆదివారం ఇండియన్‌రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామ యువకులు, గ్రామస్థులు రక్తదానం చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు జూపల్లి భాగ్యమ్మ, సింగిల్ విండో డైరెక్టర్ జూపల్లి రఘుపతిరావుల ఆధ్వర్యం లో అంబేడ్కర్ జయంతి వేడుకల ను కుడికిళ్ల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అంబేడ్క ర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున యువకులు పాల్గొని రక్తదానం చేశారు. జంగం సూర్యప్ర కాశ్, మౌలాలి, మూలే ఆంజనేయులు, రాసాల మూర్తి, భీంరాజు, బొల్ల ఊశన్న, తలారి పరమేష్, నాగరాజు, నరేష్, శివశంకర్, శివప్రసాద్, అశోక్, దుబాయ్ స్వామి, అంకిరా వుపల్లి గ్రామానికి చెందిన మహేష్, పులేందర్ తదితరు లు రక్తదానం చేశారు.

● కొల్లాపూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపోలో డిపో మేనేజర్ ఉమాశంకర్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ దేశానికి చేసిన సేవలను వారు కొనియాడారు.

డిపో అధికారులు ఎంఎఫ్ యాద య్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్, ట్రాఫిక్ సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వర్లు, గౌస్, మెకానిక్ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో...**

అంబేడ్కర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఆదివారం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు యాదగిరి, డాక్టర్ జయచంద్ర ప్రసాద్‌యాదవ్, డాక్టర్ షాహీద్‌లు మాట్లాడారు. ఫార్మాసిస్టు జీకే వెంకటేశ్, ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **టీఎన్‌జీవో ఆధ్వర్యంలో...**

పట్టణంలో టీఎన్‌జీవో భవనం ముందు అంబేడ్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి టీఎన్‌జీవో సీనియర్ అధ్యక్షుడు జీకే.వెంకటేశ్ నివాళులర్పించారు. టీఎన్‌జీవో సహ అధ్యక్షుడు పసుల సత్యనారాయణయాదవ్, టీఎన్‌జీవో డీసీ మెంబరు నర్మద, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు తిమ్మాజిపేట మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు, దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పూల మాల వేసి ఘన నివాళులర్పించి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని పలువురు కొనియాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. అంతకుముందు అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ బహదూర్, దానం బాలరాజు, వెంకట్రామిరెడ్డి, మాధవులు, ఉస్మాన్‌రవూఫ్, లక్ష్మీనారాయణ, దేవస్వామి, నాగసాయిలు, అనంతాచారి, మల్లేష్‌ముదిరాజ్, సహదేవ్, వరుణ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు జోగు ప్రదీప్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, స్వామి, వెంకటేశ్, జగన్‌రాజ్, కాలరాజ్, రమాకాంత్, విష్ణు, బీజేపీ నాయకులు బాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● తాడూరు: మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలల్లో ఆదివారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాల వేసి నివాళులర్పించడంతోపాటు అంబేడ్కర్ దేశం కోసం పాటుపడిన సేవలను కొనియాడారు. అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులతో పాటు జడ్పీటీసీ సభ్యురాలు రోహిణి, అయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని ఎంపీటీసీల సంఘం జిల్లా కన్వీనర్ మంగి విజయ్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి శనివారం పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించి మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా లభించిన హక్కులను పొందడంతో పాటు దేశ సమగ్రత కోసం బాధ్యతలను కూడా అంతే చిత్తశుద్ధితో పాటించి నిజమైన అంబేడ్కర్ వారసులుగా నిలువాలని కోరారు. మండల కేంద్రంతో పాటు నంది వడ్డెమాన్, పాలెం, మంగనూర్, మహాదేవునిపేట, శాయిన్‌పల్లి, వట్టెం, గుడ్లనర్వ, పోలేపల్లి, గంగారం, కారుకొండ తండా తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని పలువురు నాయకులు, అధికారులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, ఆర్ అండ్ ఆర్ కాలనీ మాజీ సర్పంచులు రమణి రామునాయక్, అవంతి శంకర్, ఎంపీటీసీలు ఊశన్న, మిద్దె మల్లేష్ నాయకులు కరిగళ దశరథం, బత్తుల వెంకటేష్, నిరంజన్ యాదవ్, జుర్రు కృష్ణ, మార్కండేయ్య, అనిల్‌గౌడ్, ఊర్కొండ రఘుబాబు, మంగి విల్సన్, నరేందర్‌గౌడ్, మంగి రాజు, రాంచందర్, మోహన్, శివ, పరుశరాములు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

● ఉప్పునుంతల: మండల పరిధిలోని కొరటికల్ గ్రామంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి అచ్చంపేట ఎమ్మెల్యే సతీమణి అనురాధ నివాళుల్పరించారు. అనంతరెడ్డి, రఘుపతిరెడ్డి, జంగయ్య, సైదులు, బాబు తదితరులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: అంబేడ్కర్ చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దకొత్తపల్లిలోని బస్టాండ్ చౌరస్తాలో, చంద్రకల్, ముష్టిపల్లి, కల్వకోల్, యాపట్ల, వెన్నచెర్ల, దేవునితిర్మలాపూర్ గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, నాయినోనిపల్లి మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, మాజీ సర్పంచ్ ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాలమహానాడు రాష్ట్ర నాయకుడు తగిలి వెంకటస్వామి, బుడగ జంగాల రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణయ్య, ఎంపీటీసీ రవికుమార్, మాజీ ఎంపీటీసీ దండు నరసింహ, మాజీ సింగిల్ విండో చైర్మన్ డి.బాలస్వామి, నాయకులు శంకర్, చంద్రయ్య, కాశన్న, విష్ణు, మల్లేష్, ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● కోడేరు: మండల కేంద్రంతోపాటు జనుంపల్లి, నర్సాయిపల్లి, పస్పుల తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో గ్రామపంచాయతీ దగ్గర స్థానిక బస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆదిసోమనాథ్, ఆదికొమ్ము దానయ్య, మండల కోఆప్షన్‌మెంబరు అబ్దుల్‌కరీం, యాపచెట్టు లాల్, నరసింహ, మిద్దెరామకృష్ణ, ఆదిరాజు, రవి పాల్గొన్నారు.

● ఊర్కొండ: అంబేడ్కర్ జయంతి వేడుకలను నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలను పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. మండల కో ఆప్షన్ మెంబర్ కలీమ్ పాషా, నాయకులు జనార్దన్ రెడ్డి, జంగయ్య, అబ్దుల్ సమి, కంఠం విజయుడు, మ్యాకల శ్రీనివాసులు, చిన్న, రవి, ఆంజనేయులు, శంకర్, హరీష్, రమేష్, పరుశరాములు తదితరులు ఉన్నారు.

● మన్ననూర్: అంబేడ్కర్ చూపిన మార్గంలో యువత, విద్యార్థులు నడుచుకొని అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే సందర్భంలో గ్రామంలోని దళిత, ప్రజా సంఘాలు, వివిధ కులసంఘాలు, వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, దాసరి బాలమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహీం, అంబేడ్కర్ సంఘం నాయకులు శేఖర్, అన్వేష్, అరుణ్, బాలస్వామి , యశ్వంత్, గిరిబాబు, శేఖర్ , ఇతర సంఘాలు, నాయకులు పాల్గొన్నారు.

● బల్మూరు : మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ ఖదీర్, బాలనారాయణ, బక్కయ్య, కృష్ణయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



జూపల్లిలోఅంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

● వంగూరు: మండల కేంద్రమైన వంగూరులో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు స్వామి, జువ్వ కృష్ణయ్య పలువురు ప్రజాసంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనలో నడవడమే మనమిచ్చే ఘన నివాళి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలోను, పాటించడంలోను కృషి జరిపినప్పుడే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. ఆదివారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గల ఎస్సీ కార్పొరేషన్ అధికారం రాంలాల్‌తో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల సమర్పించి నివాళులర్పించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.


● **ఎస్పీ ఆఫీస్‌లో...**

అంబేడ్కర్ జయంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఆఫీస్‌లో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పోలీస్ సిబ్బంది సమక్షంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ యొక్క ఆశయ సాధనలను గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాలని పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అలాగే ఏడీడీఎల్ఎస్పీ సీహెచ్.రామేశ్వర్ మాట్లాడుతూ అంబేడ్కర్ యొక్క జీవిత కథను సిబ్బందికి గుర్తు చేశారు. ఆర్ఐ అడ్మిన్ జగన్, ఎస్ఐ గౌస్‌పాష, దాదాపుగా 20మందిపోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఏప్రిల్ 14 : డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కల్వకుర్తి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలల్లో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కల్వకుర్తి పట్టణంలో, మార్చాల గ్రామంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్‌లు పలువురు నాయకులతో కలిసి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్చాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 32మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలనను కొనసాగుతుందని తెలిపారు. ఆదేవిధంగా కల్వకుర్తి పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, సత్యం, బీఎస్పీ, సీపీఎం నాయకులు, కేవీపీఎస్, పలు ప్రజా సంఘాల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోర్టు ఆవరణలో అంబేడ్కర్ చిత్ర పటానికి బార్ అసోసియేషన్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ చైర్మన్ శ్రీశైలం, నాయకులు సాయన్నమాదిగ, రాంపర్వతాలు, శేఖర్, విజయ్ గౌడ్, ఎముక జంగయ్య, బాలయ్య మల్లేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రావు, తాహేర్‌అలీ, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, పరుశరాములు, వెంకటయ్య నేరటి శేఖర్, దుర్గాప్రసాద్, శేఖర్, సత్యనారాయణ, బంగారి, శేఖర్‌గౌడ్, మల్లేష్ రాజు, గోపి, నూరిముజ్జు, రాజుగౌడ్, మధు, బార్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

● **పీజీఎస్ వృద్ధాశ్రమంలో..**

కల్వకుర్తి పట్టణంలోని పీజీఎస్ వృద్ధాశ్రమంలో ఆదివారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి నిర్వాహకుడు పి.వెంకటయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు.

అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్ వల్లే రెండు సార్లు ఎమ్మెల్యేనయ్యా

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్ల వల్లే తాను డాక్టర్ నయ్యాయని, రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట పట్టణంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జయంతి కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానికంగా లింగాల చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ మనిషికి విద్య మూడో నేత్రం వంటిదని, తల్లిదండ్రులకు పిల్లల కోసం ఆస్తులు కూడబెట్టాల్సిన పనిలేదని, విద్యను అందిస్తే అదే కోట్ల ఆస్తి అన్నారు. చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమని అంబేడ్కర్ రూపొందించిన ఆర్టికల్33 వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని, ఆ ఘనత అంబేడ్కర్‌దేనన్నారు. శ్రీకాంత్ బీమా, డాక్టర్ మోపతయ్య, అంబేడ్కర్ సంఘం నాయకులు శ్రీశైలం, కుంద మల్లికార్జున్, ఆనంద్, వివిధ కులసంఘాలు , రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్

● అమ్రాబాద్: ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని అమ్రాబాద్ ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మాధవన్ పల్లి, వంగురోనుపల్లి, కుమ్మరోనిపల్లి, అమ్రాబాద్, ములక మామిడి, మాచారం, పదర, వంకేశ్వరం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాలను పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్ని గ్రామాల నుంచి పదర మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశానికి యువజన సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరై అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. కళాకారులు అంబేడ్కర్ జీవిత చరిత్ర పై పాడిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

అంబేడ్కర్ వాది రిటైర్డ్ ఉద్యోగి సత్యానందం, అంబేడ్కర్ యువ జన సంఘాల నాయకులు బాలకిష్టయ్య, సత్యనారా యణ, రామకోటి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అమ్రాబాద్, పదర మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలను పెద్ద ఎత్తున సాంస్కృతిక ప్రదర్శనలతో నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ